రైతులకు యూరియా కష్టాలు

సంగారెడ్డి జిల్లాలో భారీగా
పోలీసుల బదిలీలు

20 మందికి స్థానచలనం, 19 మంది అటాచ్‌మెంట్

ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ

సంగారెడ్డి క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో భారీగా పోలీసు కానిస్టేబుళ్ల బదిలీలు జరిగాయి. ఈ మేరకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న పోలీసులను గుర్తించి వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. మొత్తం 20మంది కానిస్టేబుళ్లను బదిలీ చేయగా ఇందులో 12 మంది పురుష కానిస్టేబుళ్లు, 8 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు. బదిలీ అయిన పోలీసులంతా వెంటనే తమ తమ స్థానాల్లో విధుల్లో చేరాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో 19 మంది పోలీసులకు వివిధ పోలీస్‌స్టేషన్‌లకు అటాచ్‌మెంట్ చేస్తూ జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఇద్దరు ఏఎస్‌ఐలు, ఐదుగురు హెడ్ కానిస్టేబుళ్లు, ఏడుగురు పురుష కానిస్టేబుళ్లు, ఐదుగురు మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు.

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

జిల్లాలోని 33 పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు అనేక సంవత్సరాలుగా ఒకే చోట పనిచేస్తున్నారని 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'పాతుకుపోయారు' అనే శీర్షికన మే 10న కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనానికి స్పందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ జిల్లాలో పోలీసులు ఏ ప్రాంతాల్లో ఏళ్లకు ఏళ్లుగా పనిచేస్తున్నారో జాబితాను తెప్పించుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తాజాగా జిల్లాలో 39 మంది పోలీసులను బదిలీలు, అటాచ్‌మెంట్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మారుమూల ప్రాంతమైన నారాయణఖేడ్, కల్హేర్ తదితర పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న పోలీసులను పటాన్‌చెరు, సంగారెడ్డి తదితర దూర ప్రాంతాలకు, హైదరాబాద్ నగరానికి సమీపంలో పనిచేస్తున్న వారిని మారుమూల ప్రాంతాలకు బదిలీ చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెదక్ జిల్లా కేంద్రానికి
రింగ్ రోడ్డు కలేనా?

- 1992లో మాస్టర్‌ప్లాన్‌కు రూపకల్పన
- నేటికీ అమలులోకి రాని వైనం
- పట్టణం గుండా వెళ్తున్న జాతీయ రహదారులు
- నాడు జనాభా 20 వేలు.. ప్రస్తుతం 70 వేల పైచిలుకు
- కేసీఆర్‌తో సహా నేతలందరూ హామీలిచ్చిన వారే!



మెదక్ పట్టణంలో హైవే నిర్మాణ పనులు

మెదక్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రానికి రింగ్ రోడ్డు ఏర్పాటవుతుందా అన్న ప్రశ్నకు ఇప్పట్లో సమాధానం లభించేటట్లు లేదు. 1992 సంవత్సరంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం పట్టణాభివృద్ధికి పలు ప్రణాళికలు రూపొందించారు. అప్పట్లో 20 వేల జనాభాను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ప్రణాళికలు.. ప్రస్తుతం 70 వేల మందికి పైగా జనాభా ఉన్న మెదక్ పట్టణానికి ఎంతవరకు సరిపోతున్నాయన్నది అంతుచిక్కని ప్రశ్న. పట్టణ విస్తీర్ణం మూడు రెట్లు పెరిగింది. కొత్తగా వెలసిన బస్తీలు, వెంచర్లు, నూతన కాలనీల ఏర్పాటుతో మాస్టర్‌ప్లాన్‌కు భిన్నంగా మెదక్ నగరంగా ఎదుగుతోంది. ఈ పరిస్థితుల్లో పట్టణానికి రింగ్ రోడ్డు తప్పనిసరి. మెదక్ పట్టణం గుండా బోధన్ జాతీయ రహదారి నిర్మించారు. సంగారెడ్డి- మెదక్ -ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణమూ వేగంగా జరుగుతోంది. రోజురోజుకూ పెరిగే వాహనాల రద్దీ, పెట్రోలు బంకులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల మధ్య ఈ రహదారులపై వాహనాల రాకపోకలతో ప్రజల జీవితాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. దీంతో మెదక్ పట్టణానికి రింగ్ రోడ్డు ఆవశ్యకత మరింతగా పెరిగింది.

హామీలతోనే సరి

ప్రతీ ఎన్నికల్లోనూ మెదక్ పట్టణానికి రింగ్‌రోడ్డు నిర్మిస్తామని హామీ ఇవ్వడం అన్ని పార్టీలకూ రివాజుగా మారింది. గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా

మిగతా 8వ పేజీలో

టెన్త్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో 195 మంది పరీక్ష రాయగా 109 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 61 మంది, బాలికలు 48 మంది ఉన్నారు. 55.90 ఉత్తీర్ణత శాతం నమోదైందని డీఈవో తెలిపారు. మెదక్ జిల్లాలో 324 మంది హాజరుకాగా 227 మంది (70.06శాతం) ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 136, బాలికలు 91 మంది ఉన్నారు. రీకౌంటింగ్ కోసం వచ్చే నెల 7 లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

మున్సిపల్ మేనేజర్లకు డిప్యూటేషన్

తూప్రాన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన ముగ్గురు మున్సిపల్ మేనేజర్లు, రెవెన్యూ ఆఫీసర్లను డిప్యూటేషన్‌పై కేటాయిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. తూప్రాన్ మున్సిపల్ మేనేజర్ ఏ. రఘువరన్‌ను రామాయంపేట మున్సిపాలిటీకి, సిద్దిపేట మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ బీ.శ్రీకాంత్‌ను తూప్రాన్‌కు, రామాయంపేట మున్సిపల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్‌ను సిద్దిపేట మున్సిపాలిటీకి డిప్యూటేషన్‌పై కేటాయిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఆదేశాలు వెంటనే అమలులోకి వస్తాయని పేర్కొన్నారు.



మెడికల్ దుకాణాల్లో ఇష్టారాజ్యం

రామాయంపేటలో యంగ్ ఇండియా విద్యాలయం



అమ్మో.. దొంగలు



సీసీ కెమెరాలో చిక్కిన దొంగ

నకిలీ ధ్రువపత్రాల కలకలం

మీసేవ కేంద్రాల్లో ఉండాల్సిన పత్రాలు మార్కెట్‌లోకి..

ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.50వేల నుంచి రూ. లక్ష వసూలు

ఐడీఏబొల్లారం మీసేవ కేంద్రాల్లో అధికారుల విచారణ


బొల్లారంలో మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు, (ఇన్‌సెట్‌లో) నకిలీ ధ్రువపత్రం

ఐడీఏబొల్లారం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడలో నకిలీ ధ్రువపత్రాల విక్రయం కలకలం రేపింది. మీసేవ కేంద్రాలు జారీ చేయాల్సిన పత్రాలపై రెవెన్యూ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి ఇతర రాష్ట్రాలకు చెందినవారికి ధ్రువపత్రాలు జారీ చేస్తున్నట్లు రెవెన్యూ సిబ్బంది గుర్తించారు. దీనిపై తహసీల్దార్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడలో వివిధ రాష్ట్రాలవారు నివాసం ఉంటున్నారు. స్థానికులు కాకపోవడంతో విద్యా సంస్థల్లో వీరికి ఎటువంటి రిజర్వేషన్ వర్తించడం లేదు. దీన్ని ఆసరా చేసుకొని నకిలీ ధ్రువపత్రాలు విక్రయించే ముఠాలు పుట్టుకువచ్చాయి. ఒక్కో పత్రానికి రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు వసూలు చేసి ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్‌లు అమ్ముతున్నారు. వీటి ఆధారంగా వలస కార్మికుల పిల్లలు విద్యా సంస్థల్లో సీట్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతున్నారు. నకిలీ ధ్రువపత్రాలు జారీ చేయడానికి మీసేవ కేంద్రాల్లో ఉండాల్సిన ప్రభుత్వం జారీ చేసే అధికారిక పత్రాలనే ఉపయోగిస్తున్నారు. ఇటీవల ఐడీఏబొల్లారంలో ఇటువంటి ఫోర్జరీ సర్టిఫికెట్లు ఎనిమిది గుర్తించారు. దీంతో మరింత లోతుగా విచారిస్తే ఆసక్తికరమైన విషయాలు బయటకు వచ్చాయి.

తహసీల్దార్ సంతకం ఫోర్జరీ

మీసేవ కేంద్రాలకు సరఫరా అయ్యే ఖాళీ సర్టిఫికెట్ పేపర్లు మార్కెట్‌లో

మిగతా 8వ పేజీలో



తండావాసులు తాళం వేయడంతో తెరుచుకోని డంప్‌యార్డ్

డంప్‌యార్డ్‌కు తాళం

తెల్లాపూర్‌లో వారం రోజులుగా నిలిచిపోయిన చెత్త సేకరణ

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై పట్టణవాసుల ఆగ్రహం

పటాన్‌చెరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డంప్‌యార్డ్‌కు స్థానికులు తాళం వేయడంతో గత ఆదివారం నుంచి చెత్త సేకరణ నిలిచిపోయింది. మున్సిపల్ పరిధిలోని కాలనీలు, గ్రామాల్లో స్వచ్ఛ రిక్షాల ద్వారా సేకరించిన చెత్తను ఈదులనాగులపల్లి గ్రామ శివారులోని డంప్‌యార్డ్‌కు తరలిస్తారు. అక్కడ టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వ్యాపించి పక్కనే ఉన్న తండావాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విసుగు చెందిన తండావాసులు ఆదివారం అర్ధరాత్రి డంప్‌యార్డ్ గేట్‌కు తాళం వేశారు. అప్పటి నుంచి 40 స్వచ్ఛ రిక్షాలు నిలిచిపోయాయి. దాదాపు 60 కాలనీలు, ఐదు గ్రామాల్లో చెత్త సేకరణ నిలిచిపోవడంతో పట్టణవాసులు మున్సిపల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మున్సిపల్ పరిధిలో సేకరించిన చెత్తతో నిండిన రిక్షాలు మున్సిపల్ కార్యాలయం రోజులు తరబడి ఎదుట బారులు తీరడంతో రోడ్డుపై ప్రయాణిస్తున్నవారికి తీవ్ర అసౌకర్యం కలుగుతోంది.

అర్హులైన పేదలందరికీ
ఇందిరమ్మ గృహాలు మంజూరు

నిర్మాణ పనుల్లో పురోగతి ఆధారంగా నిధులు : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పెద్దశంకరంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ గృహాలు మంజూరు చేసి పక్కా గృహాలు నిర్మించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. పెద్దశంకరంపేటలోని కమలాపూర్‌లో శుక్రవారం ఆయన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామంలో ఫ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాకు 9వేల ఇందిరమ్మ గృహాలు మంజూరయ్యాయని, ఇందులో 4,500 గృహాలు గ్రౌండింగ్ చేశారని తెలిపారు. కొన్ని పిల్లర్ల దశకు చేరుకున్నాయని, మిగతా లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. ఇళ్లు నిర్మించుకున్నవారికి విడతలవారీగా ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని పాటించాలని, సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం 5వేల మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో షాకీర్ అలీ, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రమేష్, మాజీ సర్పంచ్ కుంట్ల రాములు, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కుంట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

అటకెక్కిన హెచ్‌ఎండీఏ లేఅవుట్

జిన్నారం, జంగంపేటలో ల్యాండ్ పూలింగ్ ద్వారా

185 ఎకరాల భూసేకరణ

రైతులకు పరిహారంగా ఎకరాకు

600 గజాల చొప్పున స్థలం కేటాయిస్తామని హామీ

రెండేళ్లుగా ప్లాట్ల కోసం నిరీక్షణ

జిన్నారం, జూన్, 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో జిన్నారంలో హెచ్‌ఎండీఏ లేఅవుట్ పనులు అటకెక్కాయి. ఎకరం రూ. 2 కోట్ల విలువైన భూములను ఇచ్చిన రైతులు పరిహారంగా ఇస్తామన్న ప్లాట్ల కోసం రెండేళ్లుగా నిరీక్షిస్తున్నారు. తీసుకున్న భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసిన అధికారులు ప్లాట్ల ఊసెత్తకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ర్హుల జాబితా అందజేస్తే పనులు చేపడతామని హెచ్‌ఎండీఏ అధికారులు అంటున్నారు. జిన్నారం మండలంలోని రెండు గ్రామాల పరిధిలో రెండేళ్ల క్రితం 185 ఎకరాల వరకు భూసేకరణ జరిపారు. జిన్నారంలో సర్వే నంబర్ 1లో 80 ఎకరాల అసైన్డ్ భూములను రైతులు స్వచ్ఛందంగా అందజేశారు. మరో 40 ఎకరాలకు సంబంధించిన రైతులు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడంతో ఆ భూముల సేకరణ చేపట్టలేదు. జంగంపేట పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 376లోనూ 105 ఎకరాలను రైతులు రెవెన్యూ అధికారులకు స్వాధీనం చేశారు. రెండు గ్రామాల్లో సేకరించిన 185 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో లేఅవుట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భూములు ఇచ్చిన రైతులకు పరిహారం కింద ఒక ఎకరాకు 600 గజాల చొప్పున స్థలం కేటాయించి పట్టాలు కూడా అందజేశారు. సేకరించిన భూముల్లో నివాసాల ఏర్పాటు చేసేందుకు అనువుగా లే ఔట్‌లుగా అభివృద్ధి చేయాల్సి ఉన్నది. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న భూముల చుట్టూ గత ఏడాదే హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. రెండేళ్లు గడిచినా రైతులకు పొజిషన్లు చూపక పోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జిన్నారంలో రైతులు ఇచ్చిన 80 ఎకరాలతో పాటు కోర్టులో కేసు ఉన్న 40 ఎకరాలను కూడా కలుపుకుని ఫెన్సింగ్ వేయటం వివాదాస్పదంగా మారింది. జిన్నారం, జంగంపేట గ్రామాల్లో లేఅవుట్ పనుల జాప్యానికి రెవెన్యూ, హెచ్‌ఎండీల మధ్య సమన్వయం లోపమే కారణమని తెలుస్తున్నది. భూ సేకరణ పూర్తిచేసి, ప్లాట్ల కేటాయింపునకు అర్హుల జాబితా, కేటాయించిన స్థలం వివరాలు ఇవ్వాలని మండల రెవెన్యూ అధికారులకు లేఖ రాసినా స్పందించడం లేదని హెచ్‌ఎండీఏ అధికారులు అంటున్నారు. మరోవైపు తహసీల్దార్ల బదీలీలతో ఈ వ్యవహారం మరుగునపడుతున్నదని విమర్శలు వ్యక్తమవున్నాయి.


జిన్నారంలో హెచ్‌ఎండీఏ సేకరించిన స్థలం చుట్టూ వేసిన ఫెన్సింగ్

అర్హుల జాబితా ఇస్తే పనులు ప్రారంభిస్తాం

జిన్నారం, జంగంపేట గ్రామాల్లో ల్యాడ్ పూలింగ్ ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్‌ఎండీఏ డీఈఈ సత్య ప్రసాద్ తెలిపారు. భూ విస్తీర్ణం, అర్హులైన రైతుల జాబితా, వారికి కేటాయించిన హరాముల వివరాలు అందజేయాలని మండల రెవెన్యూ అధికారులకు లేఖలు రాశామని తెలిపారు. తహసీల్దార్ దేవదాసు స్పందిస్తూ హెచ్‌ఎండీఏ ల్యాండ్ పూలింగ్ భూముల వ్యవహారంలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. విలువైన భూములను అభివృద్ధి పేరిట తీసుకుని రెండేళ్లు గడిచినా తమకు పరిహారం కింద కేటాయించిన భూములు ఎక్కడో తెలియని పరిస్థితి ఉందని రైతులు కోరబోయిన యాదగిరి, రాఘవేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. లేఅవుట్ కోసం భూమి ఇచ్చేయడంతో ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడంలేదని వాపోయారు. ప్రాజెక్టు పనులు ప్రారంభం కాకపోవటంతో పరిహారంగా కేటాయించిన ప్లాటు ఎక్కడో చూపడంలేదని అన్నారు.

రామాయంపేటలో యంగ్ ఇండియా విద్యాలయం

● మొదటి విడతలోనే నిర్మాణానికి చర్యలు
● టీజీఈడబ్ల్యూ ఐడీసీ భూ-సర్వే పూర్తి


యంగ్ ఇండియా, ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నమూనా

రామాయంపేట,జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నేలా యంగ్ ఇండియా, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ రూపుదిద్దుకోబోతుంది. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలే లక్ష్యంగా రాష్ట్రంలోని 59 కాంప్లెక్స్‌ల్లో భాగంగా మొదటి విడతలో మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో దీన్ని నిర్మించ తలపెట్టారు. ఇందుకోసం 22ఎకరాల విస్తీర్ణంలో రూ.210 కోట్లు వెచ్చించేందుకు రంగం సిద్ధమైంది.ఈ మేరకు పక్షం రోజుల కిందట టీజీఈడబ్ల్యూఐడీసీ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ గణపతిరెడ్డి, జిల్లా ఇంజనీరింగ్ విభాగం అధికారులు భూ సర్వే చేపట్టారు. స్థానిక బైపాస్, డబుల్ ఇళ్లు ఆనుకొని 1421 సర్వే నెంబర్‌లో స్థలాన్ని అనువైనదిగా మ్యాప్ ఆధారంగా ధ్రువీకరించారు. దీంతో ఇక టెండర్ల ప్రక్రియకు అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. అన్ని హంగులతో ఇక్కడ అధునాతన భవనం ఏర్పాటై.. 2500 మంది ఐదు నుంచి ఇంటర్ విద్యార్థులకు ఆశ్రయం ఇవ్వనుంది. ఇది పూర్తయ్యాక విద్యార్థులకు నీట్, ఐఐటి లాంటి అధునాతన శిక్షణలు ఇస్తారు. అత్యంత ఉన్నత నాణ్యత గల డిజిటల్ ఎడ్యుకేషన్ ఉంటుంది. అలాగే టీచింగ్ స్టాఫ్ కోసం క్వార్టర్స్ ఏర్పాటు చేస్తారు. మొట్టమొదటి సారిగా రామాయంపేటలో ఇంతటి ప్రాధాన్యత గల కాంప్లెక్స్ ఏర్పాటవటం ఈ ప్రాంత అభివృద్ధికి సోపానంగా మార్చుకునేందుకు అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బంగారం దాస్తామని.. పుస్తెలతాడు అపహరణ

హుస్నాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అక్కన్నపేట రోడ్డులో శుక్రవారం ఓ వృద్ధురాలిని నమ్మించి ఆమె మెడలోని రెండున్నర తులాల పుస్తెల తాడును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామానికి చెందిన పిట్టల లచ్చవ్వ అనే వృద్ధురాలు పని నిమిత్తం హుస్నాబాద్‌కు వచ్చింది. పని ముగించుకొని నడుచుకుంటూ పట్టణంలోని అక్కన్నపేట రోడ్డులో ఉన్న బంధువుల ఇంటికి వెళ్తుండగా ఇరువురు వ్యక్తులు ఆమెకు అడ్డుగా వచ్చి, ఏందమ్మా మెడలో అంత బంగారం వేసుకొని వెళ్తున్నావు. దొంగలు వచ్చి ఎత్తుక పోతారు. మా సారు రమ్మంటండని చెప్పి పక్క గల్లీలోకి తీసుకెళ్ళారు. ఆ పుస్తెల తాడు ఇవ్వు. ప్యాక్ చేసి ఇస్తామని నమ్మబలికి ఆమె వాటిని ఇవ్వగా ప్యాక్ చేసిన కవర్‌ను చేతులో పెట్టి జాగ్రత్తగా వెళ్లమని పంపించారు. కొంత దూరం వెళ్లి కవర్‌ను చూడగా అందులో ఇసుక ఉండటంతో లబోదిబోమని మొత్తుకుంది. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్ళగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అమ్మో.. దొంగలు

●నర్సాపూర్‌లో వరుస ఘటనలు

నర్సాపూర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలో వరుస చోరీలు జరుగుతుండటం స్థానిక పోలీసులకు పెను సవాల్‌గా మారింది. నియోజకవర్గ కేంద్రంతో పాటు డివిజన్ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలో సుమారు 25వేల జనాభా ఉంటుంది. పట్టణం రోజురోజుకూ విస్తరిస్తుండటంతో పాటు వ్యాపార పరంగా కూడా అభివృద్ధి చెందుతుండటంతో ఇక్కడకు ఎవరు వస్తున్నారో ఎవరు వెళ్తున్నారో కూడా తెలియని పరిస్థితి . ఇదే అదునుగా వరుస చోరీలకు పాల్పడుతూ స్థానిక ప్రజలలో ఆందోళనకు కారణమవుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్‌తో పాటు నిఘా కూడా పెట్టి దొంగతనాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా చోరీలు ఆగకపోగా దొంగల ఆచూకీ కూడా పట్టుకోలేకపోతున్నారు. ఈ జూన్ మాసంలోనే పట్టణంలో ఐదు చోట్ల చోరీలు జరిగాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తెలుసుకోవచ్చు. జూన్ 1న నర్సాపూర్ సమీకృతమార్కెట్ వద్ద పార్క్ చేసిన ట్రాక్టర్ ఇంజన్ చోరీకి గురికాగా, జూన్ 2న ఆర్టీసీ బస్సులో నర్సాపూర్ నుంచి బోయినపల్లి వెళ్తున్న ఓ మహిళ బ్యాగులో ఉన్న ఐదు తులాల బంగారు నగలు అపహరణకు గురయ్యాయి. జూన్ 20న పోలీస్‌స్టేషన్‌కు అతీసమీపంలో ఉండే నల్లపోచమ్మ ఆలయంలో చొరబడి అమ్మవారి ముక్కుపుడక అపహరించారు. ఈ నాల్గు రోజులలో అయితే ఓ స్టీలు హార్డ్‌వేర్, మెడికల్ హాల్‌తో పాటు క్లినిక్‌లో చొరబడి అందులో ఉన్న నగదు ఎత్తుకెల్లారు. వీటితో పాటు పట్టణంలో రోడ్డుపై, ఇళ్ల ముందు పార్కు చేసిన ద్విచక్రవాహనాల అపహరణ అయితే అంతేలేకుండా పోయింది. చివరకు మూడురోజుల క్రితం ఏకంగా ఆటో కూడా ఎత్తుకెళ్లిన ఘటన ఉండటం విశేషం. పట్టణంలోనే పోలీసులు అందుబాటులో ఉండే చోటనే చోరీలు జరుగుతుండటంతో పట్టణ వాసులు ఆందోళనకు గురవుతుంటే ఇక గ్రామాలలో పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఎదురవుతుంది. సీసీ కెమరాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసినా కూడా చోరీలకు పాల్పడే వారు వాటి నుండి తప్పించుకోవడానికి ముఖాలకు ముసుగు ధరించి మరీ చోరీలకు పాల్పడుతూ వారిని గుర్తు పట్టకుండా జాగ్రతలు తీసుకుంటుండటంతో పోలీసులకు కూడా దొంగలను గుర్తించడానికి పెద్ద కష్టంగా మారింది. తాజాగా ఎస్‌బీఐ బ్రాంచిలో కూడా మేనేజర్ గదికి చెందిన కిటికీ అద్దాలు పగులగొట్టి అందులో దూరడానికి యత్నించి విఫలమైన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకున్నట్లు బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విధంగా వరుస చోరీలతో పట్టణ వాసులను ఆందోళనకు గురిచేస్తున్న వారి ఆగడాలను కట్టడి చేసి వారిని పట్టుకుని తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సీసీ కెమరాలో చిక్కిన చోరికి పాల్పడుతున్న వ్యక్తి

భవనంపై నుంచి పడి బాలుడి మృతి

పటాన్‌చెరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : భవనంపై నుంచి పడి బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన బీడీఎల్‌లో జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కి చెందిన రూప్ చంద్ భార్య సత్యశీల, ముగ్గురు పిల్లలతో కలిసి వెలమెల సమీపంలోని అభినందన కనస్ట్రక్షన్‌లో మేస్త్రీ పని చేసుకుంటూ అక్కడే క్యాంపులో ఉంటున్నాడు. సోమవారం నిర్మాణ దశలో ఉన్న భవనం వద్దకు వచ్చిన చిన్న కుమారుడైన లవ్ (3)ను తీసుకొని వెళ్లాడు. మూడో అంతస్తులో భార్యా భర్తలు పని చేస్తుండగా లవ్ ఆడుకుంటూ మూడో అంతస్తుపై నుంచి కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలైన బాలుడిని చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి తండ్రి రూప్‌చంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

జహీరాబాద్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మాడ్గి శివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన గురువారం అర్థరాత్రి కర్ణాటక-తెలంగాణ సరిహద్దు వద్ద 65వ జాతీయరహదారిపై మొగుడంపల్లి మండలంలోని మాడ్గి శివారులో జరిగంది. చిరాగ్‌పల్లి ఎస్సై రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో సుమారు 40 సంవత్సరాల వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అన్నారు. మృతదేహానికి సంబంధించిన వారెవరైనా ఉంటే చిరాగ్‌పల్లి పోలీసులను సంప్రదించాలని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

మనోహరాబాద్ జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నీరు తాగేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన గురువారం మండల పరిధి ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్థులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో అటవి ప్రాంతం పక్కన బోరు కలదు. ఈ బోరు గుండానే గ్రామానికి మంచి నీరు సరఫరా అవుతుంది. పశువులు బోరు మోటర్ చుట్టు పక్కల మేత మేస్తూ బోరు వద్ద నీటిని తాగుతాయి. రోజూలాగే శుక్రవారం సాయత్రం బోరు మోటర్ వద్ద గుంతలో నీటీని తాగడానికి వెళ్లిన గేదె విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. బాధితులు ఘటనా స్థలాన్ని పరిశీలించగా బోరు మోటర్ షాక్ వస్తుందని అన్నారు. మహేష్ అనే రైతు నెల క్రితం రూ.1 లక్ష 20 వేల రూపాయాలు పెట్టి ఈ గేదెను కొనుగోలు చేశానని అన్నాడు. రైతు గేదె మృతి చెందడంతో కన్నీటి పర్యావంతంగా గోస చెప్పుకున్నాడు. విద్యుత్ అధికారులు స్పందించి రైతుకి న్యాయం చేయాలని గ్రామస్థులు వేడుకున్నారు. బోరు మోటర్ గ్రామ శివారులో ఉండటంతో అనేక సార్లు దొంగలు కేబుల్ కట్ చేస్తున్నారని కార్యదర్శి అన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన వృక్షం


రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షం

వర్గల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మైలారం వద్ద శుక్రవారం సాయంత్రం విపరీతమైన ఈదురు గాలులతో మైలారం నుంచి నెంటూర్ వెళ్లే రహదారిపై రోడ్డు పక్కనే ఉన్న వృక్షం నేలకొరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో మైలారం నుంచి నెంటూర్ వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్థులు వృక్షాన్ని పక్కకు తీసేందుకు శత విధాల ప్రయత్నం చేసి చివరకు దానిని రోడ్డు పక్కకు తోసేయడంతో వాహనాల రాకపోకలు యదావిధిగా కొనసాగాయి. రోడ్డుకు అడ్డంగా పడిపోయిన వృక్షాన్ని తీయడానికి దాదాపు గంట సమయం పట్టిందని స్థానికులు చెప్పారు.

సెంట్రింగ్ డబ్బాల దొంగల ముఠా అరెస్ట్

అమీన్‌పూర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్‌లోని ఓ నిర్మాణ సంస్థ నుంచి సెంట్రింగ్ డబ్బాలు దొంగిలించి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపిన వివారల ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో అదిత్రీ నిర్మాణ సంస్థకు చెందిన ప్రాజెక్టు వద్ద సెంట్రింగ్ డబ్బాలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తుండగా శుక్రవారం ఓ బొలేరో వాహనంలో అనుమానాస్పదంగా తరలిస్తున్న సెంట్రింగ్ డబ్బాలను పోలీసులు పట్టుకున్నారు. వాహనంలో ప్రయాణిస్తున్న కోహీర్ మండలం కవేలీ గ్రామానికి చెందిన చాపలఅంజలి, గోసనినందిని, సదాశివపేట సిద్దాపూర్ కాలనీకి చెందిన చాపలసుశీల శాంతమ్మ, చాపలఅనిత, వాహనం డ్రైవర్ అనంతపూర్‌కు చెందిన ప్రసాద్‌లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా దొంగతనం చేసినట్లు అంగీకరించారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి బొలేరో వాహనాన్ని, అందులోని 30 సెంట్రింగ్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు.

బైక్ దొంగల అరెస్టు

జిన్నారం, జూన్ 27, (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాలలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం గడ్డపోతారం మున్సిపాలిటీ కిష్టయ్యపల్లి చౌరస్తా వద్ద ఎస్సై కిష్టారెడ్డి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఓ ఆటోలు ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు వాహనం ఆపకుండా పారిపోవటానికి ప్రయత్నించారు. ఎస్సై కిష్టారెడ్డి సిబ్బంది వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌ల చోరీలకు పాల్పడ్డారని సీఐ రవీందర్‌రెడ్డి తెలిపారు. నిందితులు షేక్ ఫక్రోద్దీన్, జగన్‌లు మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం అంతారం గ్రామానికి చెందిన వారు. మరో నిందితుడు రాకేష్ రంగారెడ్డి మేడ్చల్ జిల్లా దుందిగల్‌కు చెందిన వాడు. కొంత కాలంగా వీరు ముగ్గురు కలిసి దుందిగల్, నర్సాపూర్, గడ్డపోతరం పరిధిలో 9 ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు గుర్తించి వీరు ముగ్గురితో పాటు వీరికి సహకరించిన ఆటో డ్రైవర్ జగన్‌ను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ఎల్ఈడీ పార్క్‌కు మట్టి అక్రమ రవాణ

జిన్నారం, జూన్, 27 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం రాళ్లకత్వ శివారు నుంచి ఎల్ఈడీ పరిశ్రమల ప్రాంతానికి మట్టి అక్రమ రవాణ జోరుగా జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. రాళ్లకత్వ గ్రామ సమీపంలో నుంచి కొన్ని రోజులుగా రాత్రి వేళ ఎల్ఈడీ పార్క్ పరిశ్రమల ఏర్పాటు పనుల కోసం భారీగా మట్టిని తరలిస్తున్నారని, భారీ వాహనాలతో రహదారులు గుంతల మయం కాగా సహజ సంపదను అక్రమార్కులు దోచుకుంటున్నారని స్థానికులు తెలిపారు.

సీపీఐని తిరిగి బలోపేతం చేయాలి


జిల్లా సీపీఐ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు నర్సింహా

నర్సాపూర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో సీపీఐ గతంలో ఎన్నో పోరాటాలు చేసి పేదలకు పెద్ద మొత్తంలో భూపంపిణీ చేసి జిల్లాలో ప్రత్యేక స్థానంలో ఉండేదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నర్సింహా పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లోని సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కాలేక్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నర్సింహా మాట్లాడుతూ జిల్లాలో సీపీఐని తిరిగి బలోపేతం చేసి పేదల పక్షాన పోరాడుతూ వారికి అండగా ఉండేలా ప్రతి కార్యకర్త కష్టపడాలన్నారు.

నూతన విద్యా విధానం అమలు చేయాలి

- ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి
- పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయండి
- తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ డిమాండ్



మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్

మెదక్ అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని తక్షణమే అమలు చేయాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ డిమాండ్ చేశారు. మెదక్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా కార్యనిర్వాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని సురేష్ కోరారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి విధానాన్ని తిరిగి అమలు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల హెల్త్‌కార్డులు కార్పొరేట్ ఆసుపత్రులలో కూడా వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి బాస్కర్, రాష్ట్ర బాధ్యులు రామారావు, మహిళ అధ్యక్షురాలు స్వరూపరాణి, స్వప్న, మాధవ్‌రెడ్డి, జిల్లా బాధ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీలకు ప్రత్యేక వ్యవస్థ అవసరం

- డీఈవో, ఎంఈవోలతోనే తనిఖీలు జరగాలి
- పెండింగ్ బిల్లులు, డీఏలు చెల్లించాలి
- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి



మాట్లాడుతున్న టీఎస్‌యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి

నారాయణఖేడ్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల తనిఖీ కోసం ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి అన్నారు. శనివారం నారాయణఖేడ్‌లో నిర్వహించిన సంఘం డివిజన్ స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులను పర్యవేక్షణకు వినియోగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణ బాధ్యతలకు డీఈవో, డిప్యూటీ ఈవో, ఎంఈవో, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. అవసరమైన చోట్ల అదనపు పోస్టులను మంజూరు చేసి, ప్రత్యేక యంత్రాంగం ద్వారానే పర్యవేక్షణ చేపట్టాలని జ్ఞానమంజరి అన్నారు. ఉపాధ్యాయులను తనిఖీ అధికారులుగా నియమిస్తే కేడర్, సీనియారిటీ సమస్యలతో పాటు విద్యార్థులకు కూడా నష్టం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. అంతేకాకుండా, పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న బిల్లులు, డీఏలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు అందుకున్న శశిధర్

చిన్నశంకరంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శశిధర్ రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు ఎంపికయ్యారు. గతంలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహించి, అక్కడ ఉత్తమ ఫలితాలు సాధించినందుకుగానూ రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డుకు ఆయనను ఎంపిక చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లోని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగిత రానా, ఇంటర్మీడియట్ కమిషనర్ కృష్ణ ఆదిత్య చేతుల మీదుగా శశిధర్ ఈ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శశిధర్ మాట్లాడుతూ ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందని, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ప్రిన్సిపాల్‌ను అధ్యాపక బృందం అభినందించింది.

మెడికల్ దుకాణాల్లో ఇష్టారాజ్యం

- విచ్చలవిడిగా షాపుల ఏర్పాటు
- ఫార్మాసిస్టు లేకుండానే...
- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఇవ్వకున్నా విక్రయాలు
- నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నా తనిఖీలేవి?



గజ్వేల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఔషధ నియంత్రణ సంస్థ నిబంధనలను బేఖాతర్ చేస్తూ మెడికల్ దుకాణాలు ఇష్టానుసారంగా నడుస్తున్నాయి. సిద్దిపేట జిల్లాలో సుమారు 800పైగా ఫార్మసీలు ఉండగా, వాటిలో చాలావరకు నియమాలను తుంగలో తొక్కుతూ కొనసాగుతున్నవే.

ఉల్లం'ఘనులు'

మెడికల్ దుకాణాలు నిర్వహించాలంటే తప్పనిసరిగా ఫార్మాసిస్ట్ ఉండాలి. కానీ, దాదాపుగా మెడికల్ షాపు నిర్వాహకులు అందరూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నవారే. జిల్లా వ్యాప్తంగా ఫార్మసిస్టులు ఉన్న దుకాణాలు 20కి మించి లేవంటే అతిశయోక్తి కాదేమో. కొన్ని దుకాణాల్లో రెండు, మూడేళ్ల పాటు పనిచేసి స్వయంగా మెడికల్ షాపును పెట్టుకొని అద్దెకు బీ-ఫార్మసీ, డీ-ఫార్మసీ సర్టిఫికెట్ తెచ్చుకొని యథేచ్ఛగా నడిపిస్తున్నారు. ఈ ఫార్మాసిస్టుల సర్టిఫికెట్‌కు కొందరు నెలవారీగా, మరికొందరు సంవత్సరానికి ఒకసారి డబ్బులు చెల్లిస్తూ వ్యాపారం చేస్తున్నారు. ఇటా మందుల గురించి సరైన అవగాహన లేని వ్యక్తులే వాటిని అమ్ముతున్నారు. అంతేనా ఇంటర్, డిగ్రీ కూడా పూర్తి చేయని వారిని షాపుల్లో పనికి కుదుర్చుకుని వారి ద్వారా మందులను ఇప్పిస్తున్నారు. దీంతో రోగులకు తప్పుడు మందులు వెళ్లే ప్రమాదాన్ని పెంచుతోంది.

ప్రిస్క్రిప్షన్ లేకుండానే విక్రయాలు

వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మకూడదన్న నిబంధనను మెడికల్ షాపులు అస్సలు పట్టించుకోవడం లేదు. అడిగిన వారందరికీ ఏ మందులంటే అవి ఇచ్చేస్తున్నారు. ముఖ్యంగా షెడ్యూల్-హెచ్ డ్రగ్స్‌ను కూడా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే విక్రయిస్తున్నారు. ఇది చాలా ప్రమాదకరం. మందులు కొన్న తర్వాత బిల్లులు ఇవ్వడం లేదు.

మెడికల్ షాపుల్లోనే క్లినిక్‌లు

కొన్ని మెడికల్ షాపుల్లోనే డాక్టర్లను ఉదయం, సాయంత్రం వేళల్లో కూర్చోబెట్టి క్లినిక్‌లు నడుపుతున్నారు. అంతేకాదు షాపులకు అనుబంధంగా కొన్ని చోట్ల చిన్నపాటి డయాగ్నస్టిక్ సెంటర్లనే నడిపిస్తున్నారు. అర్హత లేని వారితో టెస్టులు చేయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ వ్యవహారంపై వైద్యారోగ్య శాఖ, ఔషధ నియంత్రణ అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలేవి?

మందుల దుకాణాలపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు నిరంతరం పర్యవేక్షణ చేయాలి. లైసెన్సులు, ఫార్మాసిస్టులు ఉన్నారా లేదా, రికార్డులు సరిగా ఉన్నాయా అని తనిఖీ చేయాలి. కానీ సిద్దిపేట జిల్లాలో అధికారులు ఈ తనిఖీలను నామమాత్రంగానే చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ నిర్లక్ష్యం వల్లే ఎవరుపడితే వారు యథేచ్ఛగా మందులు అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చినుకు పడితే మల్లన్న గుడి జలమయమే

- శిథిలావస్థకు చేరిన రేకులకుంట ఆలయం
- కూలిన గోడలు, బీటలు వారిన గోపురాలు
- ఆదాయం ఉన్నా.. అభివృద్ధి శూన్యం
- భక్తులకు కనీస వసతులు లేక ఇబ్బందులు



రేకులకుంట మల్లన్న ఆలయం, గురువారం కురిసిన వర్షానికి కూలిన ఆలయ గోడ



దుబ్బాక, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక రేకుల కుంట మల్లికార్జున స్వామి, రేణుకా ఎల్లమ్మ ఆలయాలు దుర్భర స్థితిలో ఉన్నాయి. లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. సరైన గోపురం, చుట్టూ గోడలు లేక, వర్షం పడితే ఆలయం మొత్తం నీటితో నిండిపోతోంది. నడి అటవీ ప్రాంతంలో ఉన్న ఈ ఆలయానికి వచ్చే భక్తులకు కనీస వసతులు కూడా లేకపోవడంతో వారానికోసారి జరిగే జాతరలో అవస్థలు తప్పడం లేదు.

నయాపైసా విదల్చని ప్రభుత్వం

దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయానికి ఏటా సుమారు రూ.50 లక్షల నుంచి 60 లక్షల వరకు ఆదాయం వస్తోంది. అంతేకాకుండా, ఆలయం పేరుతో ఎస్‌బీఐ, టీజీబీ బ్యాంకుల్లో రూ.1.40 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. 40 తులాల బంగారం, 15 కిలోల వెండి కూడా బ్యాంకు లాకర్‌లో భద్రంగా ఉన్నాయి. అయితే, ఇంతటి ఆదాయం ఉన్నప్పటికీ, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నయాపైసా రాకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

భక్తులకు నిలువ నీడ కరువు

ఆలయం మల్లన్నగుట్టలు రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండటంతో కనీస వసతులు కూడా లేవు. గతంలో దాతలచే నిర్మించిన సత్రాలు, గదులను అటవీ అధికారులు కూల్చివేయడంతో భక్తులకు నిలువ నీడ లేకుండా పోయింది. ఆలయ మండపం కేవలం పిల్లర్లతోనే ఉండటం, ఎల్లమ్మ, మల్లన్న ఆలయాల మధ్య చిన్న గోడ ఉండటంతో గుట్టల నుంచి వచ్చే వరద నీరు నేరుగా ఆలయంలోకి చేరుతోంది. ఎల్లమ్మ, మల్లన్న ఆలయాల గోడలు బీటలు వారాయి. ఆలయంపై స్లాబ్‌పైన నిర్మించిన గోపురం బరువుకు ఒక పిల్లర్ కిందికి జారడంతో ప్రమాదకరంగా మారింది. వర్షం పడితే జలమయంగా మారే ఆలయం పరిస్థితి భక్తుల్లో ఆందోళన కలిగిస్తోంది.

అనుమతుల కోసం ఎదురుచూపులు

ఈ ఆలయాన్ని పునరుద్ధరించాలంటే అటవీ శాఖ అనుమతులు తప్పనిసరి. ఆలయం చుట్టూ రెండు హెక్టార్ల అటవీ భూమిని కేటాయించాలని గతంలోనే ప్రతిపాదనలు పంపారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, గతంలో ఎంపీగా ఉన్న సమయంలో కేంద్ర అటవీ శాఖ మంత్రిని కలిసి విన్నవించారు. అరణ్య భవన్ నుంచి డిజిటల్ సర్వే చేయించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ద్వారా కూడా వినతులు అందాయి. అటవీ శాఖ అనుమతులు లభిస్తే, ఆలయాన్ని పునరుద్ధరించి పర్యాటక కేంద్రంగా మార్చవచ్చని, తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని భక్తులు బలంగా నమ్ముతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి, అటవీ శాఖ అనుమతులను వేగవంతం చేయాలని, ఆలయానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.



బీటలు వారి, పెచ్చులూడిన రేకులకుంట మల్లన్న ఆలయం

'గీతం'కు ప్రపంచస్థాయిలో ప్రత్యేక గుర్తింపు

టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో చోటు

పటాన్‌చెరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : యూకేలోని టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇంపాక్ట్ ర్యాంకింగ్స్ 2025లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం చోటు దక్కించుకుని ప్రపంచ గుర్తింపు సాధించిందని డైరెక్టరేట్ ఆఫ్ అక్రిడిటేషన్, ర్యాంకింగ్స్ గర్వంగా ప్రకటించింది. ఈ మేరకు డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజా ప్రభు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో (ఎస్‌డీజీ) ప్రధాన మైలురాయికి చేరుకుని గీతం ర్యాంకు పొందడం విశేషమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అతి తక్కువ విశ్వవిద్యాలయాలు మాత్రమే ఈ ప్రత్యేకతను సాధించాయని ఆయన పేర్కొన్నారు. స్థిరత్వం, విద్యా నైపుణ్యం, సామాజిక ప్రభావం పట్ల గీతం నిబద్ధతను ఈ విజయం స్పష్టం చేస్తుందని ప్రొఫెసర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా, ఏడు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో, వంద ఉత్తమ ప్రపంచ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా గీతం గుర్తింపు పొందడం ఈ ఏడాది ర్యాంకింగ్స్‌లో ఒక విశిష్ట విజయంగా నిలిచిందని పేర్కొన్నారు. సరసమైన, స్వచ్ఛమైన శక్తి (అఫర్డేబుల్ అండ్ క్లీన్ ఎనర్జీ) విభాగంలో గీతం 81వ ర్యాంకు సాధించిందని, ఇది సంస్థ ప్రయాణంలో అద్భుతమైన ఘనతగా అభివర్ణించారు. గత నాలుగేళ్లుగా ఈ ర్యాంకింగ్స్‌లో గీతం స్థిరమైన పురోగతిని ప్రదర్శిస్తోందని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీల్లో 'ఈసీసీ డే'

- చిన్నారులతో పాటు అమ్మల సందడి
- ప్రతీ నెలా ఒకరోజు భాగస్వామ్యం
- అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ

సిద్దిపేట జిల్లా వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు	1,150
ఏడాదిలోపు పిల్లలు	7,027
మూడేళ్లలోపు	25,503
3-6 లోపు	15,359

సిద్దిపేట అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు నూతన విద్యా విధానంపై అవగాహన కల్పించేందుకు రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో ఐసీడీఎస్ ఈసీసీ డే (ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా చిన్నారుల్లో ఆటపాటలు, కథల ద్వారా విజ్ఞానాన్ని అందిస్తారు. తల్లిదండ్రులను కూడా భాగస్వామ్యం చేస్తూ సృజనాత్మకతను పెంపొందించడానికి ఐసీడీఎస్ కృషి చేస్తోంది. దీనికి సంబంధించి అంగన్‌వాడీ టీచర్లకు ఈ నెల 29 వరకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

నెలకు ఒకసారి అమ్మలు కూడా..

'ఈసీసీ డే' కార్యక్రమంలో భాగంగా ప్రతీ అంగన్‌వాడీ పరిధిలో నెలకు ఒకసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ రోజున పిల్లలతో పాటు తల్లులకు కూడా ఆటల పోటీలు పెడుతున్నారు. నెలరోజుల పాటు పిల్లలకు నేర్పించిన కథలు, ఆటలను ఆ రోజు ప్రదర్శింపజేస్తూ తల్లులను కూడా భాగస్వామ్యం చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల తల్లులు పిల్లలతో మమేకం కావడంతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాలపై చిన్నారులకు ఆసక్తి పెరుగుతుందని, తద్వారా సమాజంలో అవసరమైన మెలకువలను నేర్చుకోవడానికి అవకాశం ఉంటుందని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. ఇది పిల్లల్లో సామాజిక నైపుణ్యాలను, భావోద్వేగ వికాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



చిన్నారులకు నేర్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

'రిలయన్స్' వినూత్న ప్రయత్నం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్యను పెంచడానికి రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆట బొమ్మలు, వివిధ రకాల వస్తువులను అందిస్తున్నారు. వీటిని ఉపయోగిస్తూ పిల్లలకు కథలు, ఆటలు నేర్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఒక్కొక్క సెక్టార్ పరిధిలో ఒక్కో కేంద్రాన్ని ప్రాజెక్టుగా ఎంచుకుని రిలయన్స్ ఫౌండేషన్ విద్యార్థులకు కావలసిన వస్తువులను అందిస్తున్నది.

ప్రైవేట్ పాఠశాలల ప్రభావం

సాధారణంగా రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల వరకు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలి. అయితే, మూడు సంవత్సరాల పిల్లలు కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం లేదని టీచర్లు, సిబ్బంది చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం తల్లిదండ్రులు తమ పిల్లలను మూడేళ్ల నుంచే ప్రైవేటు పాఠశాలలకు పంపడానికి ఆసక్తి చూపడమే. ఇలా చిన్నతనంలోనే పిల్లలను ప్రైవేట్ బడులకు పంపడం వల్ల వారిపై మానసిక భారం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆటపాటల ద్వారా, సృజనాత్మక పద్ధతుల్లో చదువు గురించి తెలుసుకోకుండానే ప్రైవేట్ పాఠశాలలకు పంపడం వల్ల పిల్లలపై అధిక ఒత్తిడి పెరుగుతుంది. నిర్ణీత వయస్సు వరకు అంగన్‌వాడీ కేంద్రంలో ఉంచడం వలన పిల్లలకు అన్ని అంశాలపై అవగాహన కలగడంతో పాటు, ప్రభుత్వ పథకాల ద్వారా పౌష్టిక ఆహారం కూడా అందే అవకాశం ఉంది. సిద్దిపేట జిల్లా పరిధిలో అనేక గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలల ఆధిపత్యంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. దీనిపై అధికారులు దృష్టి సారించి, అంగన్‌వాడీల ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఈసీసీ డే కార్యక్రమంలో భాగంగా చిన్నారులు, అమ్మలకు ఆటలు ఆడిపిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు





రైతులకు యూరియా కష్టాలు

- ఇష్టారీతిన వ్యవహరిస్తున్న ఫర్టిలైజర్ షాపుల యజమానులు
- వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం

దౌల్తాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఈ వానాకాలంలో కొంతమంది రైతులు రోహిణి కార్తెకు ముందే పంటలను సాగు చేశారు. పలుచోట్ల డ్రిప్, స్ప్రింక్లర్ల సాయంతో మొక్కజొన్నను వేయగా, ఇప్పుడు పంటకు మొదటి దఫా యూరియా వేయాల్సిన సమయం వచ్చింది. రైతులు ఫర్టిలైజర్ షాపులకు వెళ్తే, యూరియా లేదు అని తెగేసి చెబుతున్నారు. ఒకవేళ ఉన్నా, తమ వద్ద ఇతర ఎరువులు, విత్తనాలు కొంటేనే ఇస్తామని షరతులు విధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఇలాంటి మాటలే ఎక్కువగా వినిపిస్తున్నాయి.

అగ్రోస్, సొసైటీ ఉన్నా తప్పని తిప్పలు

దౌల్తాబాద్‌లో ఒక అగ్రోస్ కేంద్రం, ఒక సొసైటీ ఉన్నా యూరియా కష్టాలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో ఎక్కువగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఎంత యూరియా అవసరమో వ్యవసాయ శాఖ అధికారులు ముందుగా అంచనా వేయకపోవడం వల్లే ప్రతిసారీ ఈ కొరత తలెత్తుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతోనే ఎరువుల కొరత తీవ్రమవుతోందని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి, అగ్రోస్, సొసైటీలలో సరిపడా యూరియా నిల్వ ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు.

అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు

యూరియా కొరతకు తోడు, మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణదారులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు అమ్ముతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడం, ఇష్టారీతిన వ్యవహరిస్తున్నా దుకాణదారులపై చర్యలు తీసుకోకపోవడమే దీనికి ప్రధాన కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల పెట్టుబడి వ్యయం పెరిగి, తీవ్రంగా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల వైఫల్యం

యూరియా సరఫరాలో జాప్యం, దుకాణదారుల అక్రమ దందాలపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలి. ప్రతి సీజన్‌లో యూరియా కొరత అనేది సాధారణమైపోయింది. సరైన ప్రణాళిక లేకపోవడం, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టలేకపోవడం అధికారుల వైఫల్యాన్ని స్పష్టం చేస్తోంది. పంటలకు అవసరమైన సమయంలో ఎరువులు అందకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇది రైతులను మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తుంది. కాబట్టి, అధికారులు తక్షణం స్పందించి, యూరియా కొరత లేకుండా చూడాలని, అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

పర్యావరణాన్ని పరిరక్షించాలి: డీఎఫ్‌వో

కొల్చారం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీఎఫ్‌వో జోజి అన్నారు. శుక్రవారం కొల్చారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామ శివారులో క్రషర్ పక్కన రెవెన్యూ ల్యాండ్‌లో ఉన్న పచ్చని గుట్టలను సందర్శించారు. అడవిలో ఉన్న జంతువులు, చెట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రేంజ్ ఆఫీసర్ అర్చన, శిక్షణ ఆఫీసర్ జలాలి, బీట్ ఆఫీసర్ శోభారాణి ఉన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

రామచంద్రాపురం టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మురుగునీటి సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ తెలిపారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రామంద్రారెడ్డినగర్ కాలనీలోని రాయసముద్రం చెరువు నుంచి నక్కవాగులోకి నీరు వెళ్లేందుకు బాక్స్‌డ్రైన్ నిర్మిస్తున్నట్లు ఆమె చెప్పారు. జీహెచ్ఎంసీ డీఈ అన్వేష్‌రెడ్డి, ఏఈ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాస్మొటిక్స్ కిట్ల పంపిణీ

నారాయణఖేడ్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల ప్రణాళికలో భాగంగా శనివారం పారిశుధ్య కార్మికులకు కాస్మొటిక్స్ కిట్లను మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఆరోగ్యంగా ఉండేందుకు ఈ కిట్లు దోహదపడతాయన్నారు. అనంతరం పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను శానిటేషన్ అధికారి శ్రీనివాస్‌తో కలిసి పర్యవేక్షించారు.

మూగ జీవాలకు వ్యాధినిరోధక టీకాలు

చిల్‌పచెడ్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మూగ జీవాలకు తప్పనిసరిగా వ్యాది నిరోధక టీకాలు వేయించాలని జిల్లా పశువైద్య అధికారి వెంకటయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని ఫైజాబాద్ గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఏడీ డాక్టర్ జనార్దనరావు, చిలిపిచేడ్ మండల పశువైద్య అధికారి డాక్టర్ వినోద్ కుమార్, అల్లాదుర్గం మండలం పశు వైద్య అధికారి డాక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ పద్ధతిపై అవగాహన

నర్సాపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నర్సాపూర్ మండలంలోని రుస్తుంపేటలో యాదయ్య అనే రైతు పొలంలో డ్రమ్ సీడర్ ద్వారా నేరుగా వరి విత్తడంపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు మాట్లాడుతూ ఈ పద్ధతితో తక్కువ పెట్టుబడితో అధిక రాబడి వస్తుందన్నారు.

భూ సర్వే చేయించండి!

కంది, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కంది మండలంలోని ఎర్దనూర్ గ్రామంలో సర్వే నంబరు 231లోని భూమిలో మైనింగ్ కంపెనీ సంస్థ ఆక్రమించిందంటూ, సర్వే నిర్వహించి తమకు న్యాయం చేయాలని ఆ గ్రామ రైతులు పరిగి లక్ష్మీతో పాటు మరో 10 మంది 2022లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2024 ఒకసారి, ఈ సంవత్సరం మార్చిలో మరోసారి పిటిషనర్లకు అనుకూలంగా సర్వే చేయించాలని హైకోర్టు ఆర్డరు ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఎర్ధనూర్ రైతులు కంది తహసీల్దార్ రవికుమార్‌కు హైకోర్టు ఆర్డర్ కాపీని అందజేశారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ రవికుమార్ 10 రోజుల్లో సర్వే చేయించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు

● 6 వాహనాలు వాహనాలు సీజ్

కొండాపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ గ్రామంలో పెద్ద చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను శుక్రవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. రోజుకు వందల సంఖ్యలో వాహనాలు మండల రెవెన్యూ, పోలీసు కార్యాలయాల ముందు నుంచే దర్జాగా మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు 6 వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ అశోక్ మాట్లాడుతూ అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు



మనోహరాబాద్‌లో ప్రైవేటు వాటర్ ట్యాంకర్‌తో నీటి సరఫరా



కొల్చారం మండలం రాంపూర్‌లో..

వానకాలమూ తండ్లాటే..

● మనోహరాబాద్, రాంపూర్ గ్రామాల్లో నీటి ఎద్దడి

మనోహరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండల కేంద్రంలో వర్షకాలంలో కూడా నీటి ఎద్దడి సమస్య కొనసాగుతోంది. గత 10 రోజుల నుంచి గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా సమస్య ఏర్పడింది. దీంతో కాళ్లకల్, మనోహరాబాద్ వంటి జనభా ఎక్కువ ఉన్న గ్రామాలలో కార్యదర్శులు ప్రైవేటు వాటర్ ట్యాంకర్‌లతో నీటి సరఫరా చేస్తున్నారు. గత కొన్ని రోజుల నుంచి గ్రామంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని, ఇంటి అవసరాలకు కూడా నీరు రావడం లేదని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో కొన్ని కాలనీల్లో అక్కడక్కడ మాత్రమే వాటర్ ట్యాంకర్‌తో నీరు సరఫరా చేస్తున్నారన్నారు. కొన్ని కాలనీలో వాటర్ ట్యాంకర్ రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోనాయపల్లిలో గత 20 రోజులుగా నీరు తక్కువగా వస్తుందని స్థానికతుల తెలిపారు. అధికారులు స్పందించి నీటి కష్టాలను తీర్చాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో రవీందర్‌ను వివరణ కోరగా, సిద్దిపేట జిల్లా కొండపాక వద్ద మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్ పనులు చేయడం వల్ల నీరు తక్కువగా వస్తుందని అన్నారు. మరో 5 రోజుల వరకు మండల కేంద్రంలో ఈ సమస్య ఉంటుందని తెలిపారు.

వారం రోజులుగా..

కొల్చారం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కొల్చారం మండలంలోని రాంపూర్ గ్రామంలో గత వారం రోజుల నుంచి బోరు మోటారు మరమ్మతులు చేయక పోవడంతో ప్రజలు తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఐదు సంవత్సరాలుగా మిషన్ భగీరథ నీళ్లు సరఫరా చేయాలని డిమాండ్ చేసినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పూరీ జగన్నాథస్వామి రథయాత్రలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఘనంగా పూరీ జగన్నాథస్వామి రథయాత్ర

ఐడీఏబొల్లారం/సంగారెడ్డి రూరల్/పటాన్‌చెరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్ర భక్తులకు ఆరాధ్యదైవమైన పూరీ జగన్నాథస్వామి రథయాత్ర ఐడీఏబొల్లారం పురపాలక పట్టణంలో శుక్రవారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేసి రథయాత్రను ప్రారంభించారు. సంగారెడ్డిలో ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహించారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ జగన్నాథుడి దేవాలయంలో పూరి జగన్నాథుడి రథయాత్రను పురస్కరించుకొని ఎమ్మెల్యే, మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్న ప్రసాద వితరణ కోసం లక్ష రూపాయల విరాళం అందించారు.

బీజేపీ కమిటీ ఎన్నికలో అవకతవకలపై ఎంపీకి ఫిర్యాదు



ఎంపీ రఘునందనరావుకు వినతిపత్రం అందజేస్తున్న కంది మండల బీజేపీ నాయకులు

కంది, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల కొత్త కమిటీ ఎన్నికలో అవకతవకలకు పాల్పడ్డారని మెదక్ ఆ పార్టీ కంది మండల నాయకులు భాస్కర్ తదితరులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదారాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడి నియామకం, ఇతర ఇన్‌చార్జీల ఎంపికలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని, పాతవారికి కాకుండా కొత్తవారికి కమిటీలో చోటు కల్పించారని ఆరోపించారు. స్పందించిన ఎంపీ విచారణ జరిపించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

● పటాన్‌చెరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రుద్రారం గణేష్ గడ్డ దేవాలయం వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని నాయకులు గ్రామస్థులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేపడుతున్న ఫ్లైవర్ నిర్మాణంతో భక్తులకు ఇబ్బందులను కలుగకుండా అండర్‌పాస్ బ్రిడ్జి నివారించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ హరిప్రసాద్ రెడ్డి, బలరాం, ప్రభు, నందీశ్వర్ తదితరులు ఉన్నారు.

మెదక్ జిల్లా కేంద్రానికి రింగ్ రోడ్డు కలేనా?

(5వ పేజీ తరువాయి)

పోటీ చేసిన పద్మాదేవేందర్‌రెడ్డికి మద్దతుగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రచారనికి వచ్చినప్పుడు రింగ్‌రోడ్డు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు కూడా మెదక్ చుట్టూ రింగ్ రోడ్డు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో రింగ్‌రోడ్డు డిమాండ్ నెరవేర్చే దశగా ఆయన కృషి చేసే అవకాశం ఉంది. మెదక్ రహదారి గుండా గత సంవత్సరం 90 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. పది మంది మృతిచెందారు. పట్టణం గుండా వెళ్లే భారీ ట్రక్కులు, లారీలు, బస్సుల వల్ల పాదచారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. స్కూల్ పిల్లలు, వృద్ధులు రోడ్డు దాటడానికి నరకం చూస్తున్నారు

ఎన్నికలకు ముందు హడావుడి

2023 శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణానికి బృహత్తర ప్రణాళిక రూపొందించడానికి అధికారులు కార్యాచరణ రూపొందించనున్నట్లు హడావుడి చేశారు. పలుమార్లు ప్రజాభిప్రాయ సేకరణ పేరిట అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేశారు. వర్తక, వాణిజ్య, రాజకీయ వేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఏజెన్సీకి పనులు అప్పగించారు. పట్టణ శివార్ల గుండా రింగ్ రోడ్డు నిర్మించడానికి కొంతమేర మార్కింగ్ పనులు చేపట్టి అర్ధాంతరంగా నిలిపివేశారు.

నేషనల్ హైవే అధికారులతో కలిసి డీపీఆర్ తయారు చేస్తేనే..

మెదక్ పట్టణానికి రింగ్ రోడ్డు ఏర్పాటు చేయడానికి పట్టణ స్థాయిలో మాస్టర్ ప్లాన్ నవీకరణ తక్షణం చేపట్టాలని స్థానికంగా డిమాండ్ వ్యక్తమవుతోంది. రహదారి రూట్ ప్లాన్‌కు తగిన భూములను గుర్తించి భూసేకరణపై దృష్టికేంద్రీకరించాల్సి ఉంది. ముఖ్యంగా జాతీయ రహదారి అధికారులతో కలిసి డీపీఆర్ తయారు చేయాలి. ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే రోహిత్‌రావు కేంద్ర రహదారుల శాఖను ఒప్పించి మెదక్ రింగ్‌రోడ్ ఏర్పాటు దిశగా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

● మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్ అర్బన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మెదక్, రామాయంపేట మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్, ఆయా మున్సిపల్ కమిషనర్లు, డీఈలతో కలిసి అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్‌రావు మాట్లాడుతూ.. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ముఖ్యంగా డ్రైనేజీలు, రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, తాజా మాజీ కౌన్సిలర్లతో ఆయన సమీక్షించి, వార్డుల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దశంకరంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా పెద్దశంకరంపేట మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల ఇన్‌చార్జి ఏఈ యాసిన్ అలీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల్లో ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

తూప్రాన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధిలో పేకాట శిబిరంపై గురువారం రాత్రి దాడులు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తూప్రాన్ సీఐ రంగ కృష్ణ తెలిపారు. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులో అశోక్‌జైన్ వెంచర్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తూప్రాన్-2ఎస్ఐ యాదగిరి, సిబ్బందితో కలసి దాడులు చేసినట్లు సీఐ వివరించారు. దాడుల్లో ఆరుగురు పట్టుబడగా, రూ.10,700 నగదు, మూడు బైక్‌లు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రంగ కృష్ణ తెలిపారు.

రూ.1.70కోట్లతో శ్మశాన వాటిక

● ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో మూడెకరాల్లో ఆధునిక పద్ధతుల్లో సుమారు రూ.1.70 కోట్లతో నిర్మించిన శ్మశాన వాటికను త్వరలో అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. సదరు శ్మశాన వాటికను శుక్రవారం ఆయన జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఇందులో మౌలిక వసతులకు ప్రభుత్వ నిదులతో పాటు తాను సొంతంగా రూ.20లక్షల నిదులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్‌కుమార్, డీఈ నరేందర్, ఏఈ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దు'



రామాయంపేటలో వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

రామాయంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దని పోలీసులు వ్యాపారులకు సూచించారు. ఈ మేరకు రామాయంపేట పట్టణ పాత హైవేపై, ఆర్టీసీ బస్టాండ్ అనుకొని ఆక్రమించి చిరు వ్యాపారులకు శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. తరచూ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి పండ్లు, పూలు అమ్ముతున్న వారిని పిలిచి మందలించారు. ఇప్పటికే ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ అనుకొని తోపుడు బండ్లు పెట్టి బిజినెస్ చేస్తున్నారు. అది చాలదన్నట్లు మరింత ముందుకు జరగటంతో బస్టాండ్ నుంచి బయటకు వెళ్లే ఆర్టీసీ బస్సులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఈ విషయాన్ని గమనించిన పోలీసు అధికారులు రెండు మూడు రోజుల్లో వెనక్కి జరిగి ఇబ్బందులు తొలగించాలని చిరు వ్యాపారులను ఆదేశించారు. కాగా ఈ ఘటనపై ఇదివరకే " ఆర్టీసీ బస్సులు మలిపేదెలా" అంటూ ఆంధ్రజ్యోతిలో శీర్షిక ప్రచురితమైన విషయం తెలిసిందే.

కార్మికుల ముందస్తు అరెస్టు

న్యూస్ నెట్‌వర్క్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని నెలలుగా ఉన్న పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ శాఖ కమిషనరేట్ కార్యాలయం వద్ద ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పలు మండల కేంద్రాల్లోని గ్రామ పంచాయతీ కార్మికులను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి

గుమ్మడిదల,జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదలలో ఆధార సెంటర్ లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని, వెంటనే ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తాహసీల్దార్ పరమేశంకు వినతి పత్రం అందజేశారు. నాయకులు ఆంజనేయులు, కరుణాకర్, సాయి తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎంపీడీవో కార్యాలయ పరిసరాలు శుభ్రం



పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కంది, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కంది మండలం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం అపరిశుభ్రతపై బుధవారం ఆంధ్రజ్యోతిలో 'అధ్వానంగా ఎంపీడీవో కార్యాలయ పరిసరాలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి జడ్పీ సీఈవో జానకిరెడ్డి స్పందించారు. వెంటనే కార్యాలయ పరిసరాలు శుభ్రం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్‌ను ఆదేశించగా, ఆయన కంది గ్రామ పంచాయతీ సిబ్బందిని పురమాయించారు. ఈ మేరకు శుక్రవారం కంది గ్రామ పంచాయతీ సిబ్బంది కార్యాలయ ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించారు. అలాగే దుర్వాసన వెదజల్లుతున్న మరుగుదొడ్లను శుభ్రంగా కడిగి పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

మిస్సింగ్ కేసుల్లో పురోగతి సాధించాలి

● నెలవారీ సమీక్షలో మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తూ.. సంఘవిద్రోహ శక్తులను కట్టడి చేస్తూ... ప్రజలకు భరోసా కల్పించాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మిస్సింగ్ కేసులపై ఆరా తీసి పురోగతి సాధించాలని సూచించారు. పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, జిల్లా సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలకు త్వరలో పరిష్కారం

● అదనపు కలెక్టర్ నగేష్



నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్

నర్సాపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం పూర్తయిందని, త్వరలోనే విచారణ చేపట్టి భూ సమస్యలను పరిష్కరిస్తామని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో మహిపాల్‌తో కలిసి భూభారతి, రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదుల అంశాలపై స్థానిక అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లాలో 37 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆగస్టు 14లోపు వీటిని పరిష్కరించే దిశగా కసరత్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ మహేష్, ఆర్ఐలు సిద్ధిరాంరెడ్డి, ఫైజల్ పాల్గొన్నారు.

ప్రతీ గ్రామంలో ఐదు వేల మొక్కలు నాటాలి

చిల్‌పచెడ్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవంలో భాగంగా ప్రతీ గ్రామంలో తప్పనిసరిగా ఐదు వేల మొక్కలు నాటాలని డీఆర్‌డీవో శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని జగ్గంపేట, రహీంగూడా అంతారం గ్రామాలలో కొనసాగుతున్న ఉపాధిహామీ, ఫీడర్ చానల్ పనులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీవో సాయిబాబా, ఎంపీడీవో ఆనంద్, ఎంపీవో శ్యాంకుమార్ ఉన్నారు.

ఎస్ఏలకు జీహెచ్ఎంగా ప్రమోషన్ ఇవ్వాలి

వెల్దుర్తి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఎస్ఏగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీహెచ్ఎం ప్రమోషన్‌తో పాటు ఎస్జీటీలకు ఎస్ఏ, పీఎస్ హెచ్ ప్రమోషన్లు కల్పించాలని ఎస్టీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం అన్నారు. ఈ మేరకు ఎస్టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడితో కలిసి శుక్రవారం సీఎం సలహాదారు ఎం. నరేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.

సాగుపై అవగాహన అత్యవసరం

జహీరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగుతోపాటు వ్యవసాయ భద్రతపై మరింత అవగాహన అత్యవసరమని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు సాయిప్రియాంక, స్వామీ అన్నారు. శుక్రవారం మండలంలోని హుగ్గెలి గ్రామంలో మల్లారెడ్డి విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు గ్రామీణ అంచన కార్యక్రమం నిర్వహించారు.

నేడు కిష్టారెడ్డిపేటకు మంత్రుల రాక

అమీన్‌పూర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలానికి శనివారం రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖా మంత్రి జూపల్లికృష్ణారావు, ఐటీ శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వస్తున్నట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిష్టారెడ్డిపేటలో ఏర్పాటు చేస్తున్న అమీన్‌పూర్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను ఉదయం 8.30గంటలకు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. .

నకిలీ ధ్రువపత్రాల కలకలం

(5వ పేజీ తరువాయి)

ప్రత్యక్షమయ్యాయి. వీటిపై గత నెల 20న బదిలీ అయిన తహసీల్దార్ భిక్షపతి పేరిట జూలై 19న జారీ చేసినట్లు నకిలీ ధ్రువీకరణ పత్రాన్ని తయారుచేసి, బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తికి రూ.50వేలకు విక్రయించారు. ఇలా బీహార్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఎనిమిది మందికి ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్‌లు జారీ చేసినట్లు గుర్తించారు. దీంతో ఐడీఏ బొల్లారంలోని మూడు మీసేవ కేంద్రాలపై అధికారులు శుక్రవారం దాడులు చేశారు. మీసేవ కేంద్రాల్లో ఉండాల్సిన ఖాళీ పత్రాలు ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై విచారణ జరిపారు. మల్లంపేట మీసేవ కేంద్రం వారు అమ్మకాలు జరుపుతున్నట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. నకిలీ సర్టిఫికెట్‌ల జారీ వ్యవహారంలో గుర్తుతెలియని వ్యక్తిపై తహసీల్దార్ దేవదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఐడీఏబొల్లారం సీఐ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఎనిమిది మందికి సర్టిఫికెట్లు ఎక్కడి నుంచి ఎలా వచ్చాయనేదానిపై విచారణ చేస్తున్నామని వెల్లడించారు. ఈ విషయంపై జిన్నారం తహసీల్దార్ దేవదాస్ మాట్లాడుతూ కులధ్రువీకరణ పత్రాలు జారీ చేసే సమయంలో సపోర్టింగ్ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలిస్తామని, సక్రమంగా లేకపోతే వెంటనే రిజెక్ట్ చేస్తామని తెలిపారు. ఇటీవల స్థానికులకు జారీ చేసిన పత్రాల్లో ఉన్న నంబర్లను కాపీ చేసి నకిలీ పత్రాలు పొందడానికి ఉపయోగిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. అటువంటి వాటిని ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నామని తెలిపారు.